క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన కర్నూలు రూరల్ తహసీల్దారు

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ తాహసీల్దారుగా బి.రామాంజులు నాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు ఆర్డీఓ ఆఫీస్‌లో డీఏఓగా పని చేస్తున్న ఆయనను మొదట చిప్పగిరి మండలానికి బదిలీ చేశారు. మరోసారి ఆర్డర్‌లో మార్పులు చేసి కర్నూలు రూరల్‌కు బదిలీ చేశారు. గతంలో ఈయన జిల్లాలోని నందికొట్కూరు, ఓర్వకల్లు మండలాల్లో పని చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆర్డీఓ ఎం.శేషిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆ తరువాత కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు.

నర్సింగ్ స్టూడెంట్ ఫెడరేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ స్టూడెంట్ ఫెడరేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి లో రోగులకు ఉన్నత వైద్యసేవలు అందుతున్నాయంటే దానికి కారణం నర్సింగ్ సేవలేనని చెప్పారు. వారు రోగిని 24 గంటల పాటు కంటికి రెప్పలా కాపాడుతున్నారన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 వెంకటతులశమ్మ, గ్రేడ్-2 నాగమణి, రాజ్యలక్ష్మి, అనసూయమ్మ, ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్తకోట మోహన్, నాయకులు సురేంద్రబాబు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించాలి

కర్నూలు కల్చరల్: 2017 విద్యా సంవత్సరంలో డిగ్రీ చదివి ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు స్పెషల్ పరీక్షలు నిర్వహించాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు కోరారు. సోమవారం రాయలసీమ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్‌కు విద్యార్థి సంఘం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని బ్యాక్‌లాగ్ సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహించాలని లేని పక్షంలో వర్సిటీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, నగర కోశాధికారి అశోక్, ఆర్‌యూ కార్యదర్శి ధనలక్ష్మి వీసీకి వినతి పత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

డిమాండ్లను అమలు చేయాలి




మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వం ఒప్పుకున్న అంగన్‌వాడీల డిమాండ్లను అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షురాలు పి.నిర్మల, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటమ్మ కోరారు. సోమవారం కార్మిక, కర్షక భవన్‌లో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సమ్మెలో 42 రోజులపాటు పాల్గొన్న కార్మికులందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. నాయకులు పీఎస్ రాధాకృష్ణ, విజయభారతి, గోవర్ధనమ్మ, పద్మ, బాలదర్గమ్మ, నీరజమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ తాత్కాలిక అధ్యక్షురాలిగా ప్రమీల

కర్నూలు(సెంట్రల్): మహిళా కాంగ్రెస్ జిల్లా తాత్కాలిక అధ్యక్షురాలుగా ఎస్.ప్రమీలను నియమించారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిళ ఆదేశాల మేరకు సోమవారం ఆమెకు నియామక పత్రం అందజేసినట్లు డీసీసీ అధ్యక్షుడు కె.బాబు రావు తెలిపారు.

షరాఫ్‌బజార్‌లో షాపులు తెరిపించాలని ధర్నా



కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక పాతబస్టాండ్ షరాఫ్ బజార్‌లో సీజ్ చేసిన బంగారు షాపులను తెరిపించాలని స్థానిక వ్యాపారులు కామిశెట్టి గురువయ్య, రాజేంద్రగుప్త డిమాండ్ చేశారు. సోమవారం నగరపాలక సంస్థ ఎదుట అసోసియేషన్ సభ్యులతో పాటు బంగారు వ్యాపారులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్కింగ్ స్థలం లేదంటూ 2021 సంవత్సరం నుంచి షరాఫ్‌బజార్‌లో బంగారు షాపులను నగరపాలక టౌన్‌ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారన్నారు. మూడు సంవత్సరాలు అవుతున్న తెరవకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. పార్కింగ్ స్థలం కోసం ప్రత్యేకంగా 25 సంవత్సరాల లీజ్‌తో స్థలం తీసుకున్నామని, అయినా సమస్యను పరిష్కరించడం లేదన్నారు. అనంతరం స్పందనలో నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజను కలిసి వినతిపత్రం అందజేశారు.

ప్రగతి పథంలో బోధనాసుపత్రి

- ఎన్నడూ లేని విధంగా పురోగతి
- స్పెషాలిటీతో పాటు సూపర్ స్పెషాలిటీకి పెరిగిన పీజీ సీట్లు
- 126 మందికి పైగా అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలు
- అధిక సంఖ్యలో వైద్యులకు పదోన్నతులు
- రూ.500 కోట్లతో బోధనాసుపత్రి ఆధునికీకరణ
- నిర్మాణం పూర్తి చేసుకున్న స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్



కర్నూలు మెడికల్ కాలేజి

ఇది కదా.. అభివృద్ధి

కర్నూలు(హాస్పిటల్): ఒకప్పుడు మేరా కేఎంసీ మహాన్ అనే వారు. కాలక్రమేణా పాలకులు ఈ కళాశాలపై చిన్నచూపు చూడటం, పర్యవేక్షణ లోపించడంతో కొన్నేళ్ల పాటు ఈ కళాశాల ప్రతిభ తగ్గిపోయింది. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ కళాశాలకు మళ్లీ పూర్వ రోజులు వస్తున్నాయి. కళాశాల, ఆసుపత్రిలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఎప్పుడూ లేని విధంగా వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది నియామకాలు, వైద్యులకు పదోన్నతులు, పరస్పర బదిలీలకు అంగీకారం జరిగాయి. నాడు–నేడు కింద రూ.500 కోట్లతో బోధనాసుపత్రి ఆధునికీకరణ జరుగుతోంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని కర్నూలు నుంచి హైదరాబాద్‌కు మార్చే సమయంలో(1956లో) ఈ ప్రాంతానికి ప్రభుత్వ మెడికల్ కాలేజి మంజూరు చేసి వెళ్లారు. అప్పట్లో కళాశాల భవనాలు లేకపోవడంతో రెండేళ్ల పాటు 50 ఎంబీబీఎస్ సీట్లతో గుంటూరు మెడికల్ కాలేజీలో తరగతులు నిర్వహించారు. అనంతరం కర్నూలులోనే కళాశాలను కొనసాగించారు. 2018 వరకు 200 సీట్లున్న దానిని 2019లో మరో 50 సీట్లు మంజూరు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 250 ఎంబీబీఎస్ సీట్లతో కళాశాల కొనసాగుతోంది. ఒకప్పుడు పీజీ చదవాలంటే వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. అలాంటి స్థితి నుంచి ఇక్కడే పీజీతో పాటు సూపర్‌స్పెషాలిటీ కోర్సును సైతం చదివే అవకాశం ఈ ప్రభుత్వంలో లభించింది. 2019కి ముందు సూపర్‌స్పెషాలిటీ విభాగాల్లో కేవలం కార్డియాలజి విభాగానికి ఒక్కటే రెండు పీజీ సీట్లు ఉండేవి. 2019 తర్వాత ఇతర సూపర్‌స్పెషాలిటీ విభాగాల్లోనూ పీజీ సీట్లు మంజూరయ్యాయి. మొత్తం 8 విభాగాల్లో 13 సీట్లు మంజూరు కావడంతో వైద్యవర్గాల్లో హర్షం వ్యక్తం అవుతోంది. అలాగే స్పెషాలిటీ కోర్సుల్లోని పీజీ సీట్లు 2019కి ముందు 138 మాత్రమే ఉండేవి. ఈ ప్రభుత్వం వచ్చాక అదనంగా మరో 26 సీట్లు పెరిగి మొత్తం పీజీ సీట్ల సంఖ్య 164కు చేరింది. అలాగే గత ప్రభుత్వ హయాంలో 300 వరకు మాత్రమే స్టాఫ్‌నర్సులు ఉండేవారు. ఈ ప్రభుత్వ హయాంలో ఈ సంఖ్య 800లకు పెరిగింది. దీనివల్ల రోగుల పట్ల నర్సింగ్ కేర్ మరింత పెరిగింది.

2019 తర్వాత పెరిగిన పీజీ సీట్లు

2019 వరకు 140 దాకా ఉన్న పీజీ సీట్ల సంఖ్య ఈ ప్రభుత్వంలో మరో 35 మంజూరయ్యాయి. అందులో మైక్రోబయాలజి 4, పాథాలజి 4, ఫోరెన్సిక్ మెడిసిన్ 5, ఆర్థోపెడిక్స్ 2, గైనకాలజి 6, అనెస్తీషియా 3, పీడియాట్రిక్స్ 4, ఈఎన్‌టి 2, టీబీసీడీ 2, రేడియోథెరపీ 1, సైకియాట్రి 3 సీట్లు మంజూరయ్యాయి. ఇవే గాక 2019 వరకు నాలుగు మాత్రమే ఉన్న సూపర్‌స్పెషాలిటీ సీట్ల సంఖ్య అదనంగా మరో 15 జతయి 19కి చేరాయి. ఇందులో న్యూరోసర్జరీ 2, నెఫ్రాలజి 2, ప్లాస్టిక్ సర్జరీ 1, యురాలజి 2, పీడియాట్రిక్ సర్జరీ 2, గ్యాస్ట్రో ఎంట్రాలజి 2, ఎండోక్రైనాలజి 2, న్యూరాలజి 2 సీట్లు మంజూరయ్యాయి.

కొత్తగా నియమకాలు, వైద్యులకు పదోన్నతులు

కేఎంసీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ ప్రభుత్వంలో ఏకంగా 126 అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం జరిగింది. దీర్ఘకాలంగా పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న సీనియర్ వైద్యుల సేవలను గుర్తించి వారికి పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు అప్పటి వరకు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా దశాబ్దానికి పైగా పనిచేస్తున్న వారిని అసోసియేట్ ప్రొఫెసర్‌గా, అసోసియేట్‌గా పని చేస్తున్న వారిని ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించారు. దీంతో పాటు అదనంగా నాలుగు ప్రొఫెసర్, 22 అసోసియేట్, 61 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు మంజూరు చేసి భర్తీ చేశారు. వైద్యులకు సీనియారిటీ ప్రాతిపదికన పదోన్నతులు కల్పించేందుకు గాను ముందుగా దీర్ఘకాలంగా ఒకేచోట ఉన్న వారిని బదిలీలు చేశారు.అనంతరం సీనియారిటీ ఆధారంగా పదోన్నతు లు కల్పించి కౌన్సెలింగ్ ద్వారా స్థానాలు కేటాయించారు. దీంతో పాటు వైద్యుల వినతి మేరకు పరస్పర బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. దీనివల్ల వారు కోరుకున్న ప్రాంతానికి చాలా మంది వైద్యులు బదిలీపై తిరిగి వచ్చారు. ఒకేసారి పదుల సంఖ్యలో వైద్యులు పరస్పర బదిలీలపై రా వడం ఇదే మొదటసారని వైద్యుల్లో చర్చ జరుగుతోంది.

నా జీవితంలో ఇలాంటి అభివృద్ధి చూడలేదు



నా 30 ఏళ్లకు పైగా సర్వీసులో ఎన్నడూ కర్నూలు మెడికల్ కాలేజి ఇంతలా అభివృద్ధి జరగలేదు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి నిధులు కేటాయించడం వల్ల ఇది సాధ్యమైంది. కళాశాల, ఆసుపత్రిలో ఎక్కడా ఒక్క పోస్టు కూడా ఖాళీ ఉండకుండా ఎప్పటికప్పుడు నోటిఫికేషన్లు జా రీ చేసి ఉద్యోగాలు భర్తీ చేసేలా ప్రభుత్వం ఆదేశా లు జారీ చేసింది. యూజీ, పీజీ సీట్లతో పాటు ఎప్పుడూ లేని విధంగా సూపర్‌స్పెషాలిటీ సీట్లు కూడా పెరగడం, మంజూరు కావడం విశేషం. –డాక్టర్ పి. సుధాకర్, ప్రిన్సిపాల్, కర్నూలు మెడికల్ కాలేజి

రోగులకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నాము



ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులన్నీ భర్తీ అయ్యాయి. అదనంగా మరి కొన్ని పోస్టులు మంజూరయ్యాయి. దీనివల్ల అన్ని విభాగాల్లో వైద్యులున్నారు. దీనివల్ల రోగులకు మరింత మెరుగైన, నాణ్యమైన వైద్యం అందిస్తున్నాము. ఈ మేరకు ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు అదనంగా ఈవినింగ్ ఓపీ నిర్వహిస్తున్నాము. దీనివల్ల పరీక్షల నివేదికలు అందుకున్న రోగులు మరుసటిరోజు, మరో వారం వేచి చూడకుండా అదే రోజే వైద్యులను సంప్రదించి చికిత్స చేసుకునే అవకాశం లభించింది.

–డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

నాడు–నేడు కింద సమూల మార్పులు

నాడు–నేడు కార్యక్రమం ద్వారా కర్నూలు మెడికల్ కాలేజి, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పలు నిర్మాణాలు చోటుచేసుకుంటున్నాయి. ఇందులో భాగంగా రూ.350కోట్లు నిర్మాణాలకు, రూ.150కోట్లు పరికరాలకు కేటాయించారు. ఇందుకు సంబంధించి ఐపీ భవనం, కళాశాలలో లెక్చరర్ గ్యాలరీలు, సెమినార్‌హాళ్లు, హాస్టళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. అలాగే గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురై నత్తనడకన పనులు సాగిన నిర్మాణాలు సైతం వేగం పుంజుకున్నాయి. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ కోసం రూ.90కోట్లు, బర్న్స్ వార్డు కోసం 8.7కోట్లు, డైస్ భవన నిర్మాణం కోసం రూ.1.06కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇప్పటికే రూ.12.90కోట్లుతో డయాగ్నోస్టిక్ భవన నిర్మాణం పూర్తయి రోగుల సేవలో తరిస్తోంది. ఈ భవనంలో పరికరాలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన రూ.10 కోట్లను సైతం ఇటీవల మంజూరు చేశారు. దీంతో పాటు 250 విద్యార్థులకు అనుగుణంగా ఎగ్జామినేషన్ హాలు, లెక్చర్ హాల్, ఉమెన్స్ పీజీ హాస్టల్, క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉండేలా కళాశాల మైదానం ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి.



సిద్ధమవుతున్న నూతన బర్న్స్ వార్డు

ఐఐఐటీడీఎంకు మౌలిక వసతుల కల్పన త్వరగా పూర్తిచేయాలి

- అధికారులను ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): కర్నూలులోని జగన్నాథగట్టుపై ఉన్న ట్రిపుల్ ఐటీడీఎం (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్)కు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి కలెక్టర్ డాక్టర్ జి.సృజనను ఆదేశించారు. సోమవారం సాయంత్రం విజయవాడ నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ ఐఐటీ, ఐఐఐటీడీఎం, ఏఐఎంఎస్‌ల నిర్మాణ పురోగతిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంబంధిత కలెక్టర్లతో సమీక్షించారు. అందులో భాగంగా కర్నూలు ఐఐఐటీడీఎంకు సంబంధించిన పనులపై కలెక్టర్ సృజనను ఆయన ఆరా తీశారు. ప్రహరీ గోడ నిర్మాణాన్ని జనవరి 31వ తేదీన ప్రారంభించామని, ఆ పనులు త్వరితిగతిన జరుగుతున్నట్లు కలెక్టర్ వివరించారు. తాగునీటి సరఫరాకు సంబంధించిన పనులు, సంస్థ భవన సమూదాయం మీదుగా వెళ్లే హైటెన్షన్ విద్యుత్ లైన్లను మార్చేందుకు సంబంధించిన పనులు టెండర్ దశలో ఉన్నాయన్నారు. జాతీయ రహదారి 40 నుంచి ఐఐఐటీడీఎం వరకు వేయాల్సిన రోడ్డు వెడల్పు పనులు కూడా పూర్తయ్యాయని ఆమె సీఎస్‌కు వివరించారు. కార్యక్రమంలో జిల్లా స్పెషల్ ఆఫీసర్, ఆర్‌అండ్‌బీ, ట్రాన్స్‌పోర్టు ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న కూడా ట్రిపుల్ ఐటీడీఎంకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలపై సీఎస్‌కు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ట్రిపుల్ ఐటీడీఎం డైరెక్టర్ డాక్టర్ డీవీఎల్ఎన్ సోమయాజులు, రిజిస్ట్రార్ కె.గురుమూర్తి, డీఆర్‌ఓ కె.మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

అన్నదాన సత్రంపై తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు

కర్నూలు(అర్బన్): శ్రీశైలంలోని శ్రీ అఖిల భారత కురువంశ నిత్యాన్నదాన సత్రం విషయంలో కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని జిల్లాకు చెందిన సత్రం అధ్యక్షుడు ఎంకే రంగస్వామి, సభ్యులు గుడిసె శివన్న, వెంకటేశ్వర్లు, దేవేంద్ర అన్నారు. సోమవారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ తప్పుడు ప్రచారాల వల్ల శ్రీశైలంలోని బీరప్ప సదనం దాతలకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. హైదరాబాద్‌కు చెందిన వారు సత్రాన్ని నిర్వహించిన రోజుల్లో భక్తులు, దాతలకు గదుల కేటాయింపులో, భోజనాల విషయంలో చాలా ఇబ్బందులకు గురి చేశారన్నారు. కురువలను కాకుండా ఇతర కులస్తులను మేనేజర్‌గా ఉంచి వారు ప్రవర్తించిన తీరు దాతలందరికి తెలుసునన్నారు. ఈ నేపథ్యంలోనే సత్రం రిపేర్లు త్వరగా పూర్తి చేయాలని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, రామచంద్రయ్య, గడ్డం రామక్రిష్ణతో పాటు తాము సత్రాన్ని సందర్శిస్తే ఎస్పీకి ఫిర్యాదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సత్రం విషయంలో కోసిగె శ్రీనివాసరావు, బన్నె బుచ్చన్నకు సంబంధం లేనప్పటికి కొందరు వ్యక్తులను అడ్డం పెట్టుకొని సత్రం నిర్వహణను అధ్వానంగా మార్చారన్నారు. ఎవరో చెప్పిన మాటలను నమ్మి దాతలు ఆందోళన చెందరాదన్నారు. సత్రం విషయంలో ఎలాంటి సమాచారం కావాలన్నా సెల్: 9032741194, 9440756199 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఆర్థికపరమైన డిమాండ్‌ల సాధనకు ఐక్య ఉద్యమం



సమావేశంలో మాట్లాడుతున్న వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్ల ఆర్థిక పరమైన డిమాండ్‌ల ఈ నెల 13 నుంచి ఐక్య ఉద్యమం చేపట్టనున్నట్లు ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని జిల్లా ట్రెజరీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వంపై ఉద్యోగులకు వ్యతిరేకత పెరిగేలా కొంతమంది ఆర్థిక శాఖ అధికారులు పథకం ప్రకారం ఇలా వ్యవహరిస్తున్నారనే అనుమానాలు ఉన్నాయన్నారు. 12వ పీఆర్‌సీ కమిషన్‌కు చైర్మన్‌ను నియమించి ఆరు నెలలు గడచినప్పటికీ ఇంతవరకు కార్యాచరణ మొదలు కాలేదని, ఉద్యోగ సంఘాల నేతలతో చర్చలు జరుపలేదన్నారు. పీఆర్‌సీ ఆలస్యం అవుతున్నందున అత్యవసరంగా 30 శాతానికి తగ్గకుండా మధ్యంతర భృతి ఇవ్వాలని కోరారు. 13 నుంచి ఐక్య ఉద్యమంలో భాగంగా నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. విలేకరుల సమావేశంలో ఉమ్మడి జిల్లా కార్యదర్శి జవహర్‌లాల్, అసోసియేట్ ప్రసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి, కర్నూలు నగర శాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారానికి చర్యలు



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్లు

కర్నూలు (టౌన్) : నగర ప్రజలు వివిధ సమస్యలపై అందించిన వినతుల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. సోమవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ కాలనీలకు చెందిన ప్రజలు నేరుగా కమిషనర్‌ను కలిసి సమస్యలపై వినతులు అందజేశారు. కార్యక్రమంలో నగరపాలక ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, నగరపాలక సహాయ సిటీ ప్లానర్ శశికళ, నగర పాలక మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

దోమలు, కుక్కల బెడద ఎక్కువైంది

కర్నూలు (టౌన్) :నగరంలో దోమలు, కుక్కల సమస్య అధికమైందని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కార్పొరేటర్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజను విన్నవించారు. సోమవారం వారు నగరపాలక కార్యాలయంలో కమిషనర్‌ను కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ దోమల సమస్య పరిష్కరించడంతో పాటు తుంగభద్ర, హంద్రీ నదుల్లో గుర్రపు డెక్కను తొలగించే పనులు మరింత ముమ్మరం చేయాలన్నారు. నగరంలోని మురుగు కాల్వల్లో పూడిక తొలగింపు పనులు వేగవంతం చేయాలన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ కార్పొరేటర్లు, పార్టీ వార్డు ఇన్‌చార్జ్‌లు జుబేర్ అహమ్మద్, యూనస్‌బాషా, ఆర్షియా ఫర్హీన్, శ్రీనివాసరావు, ఖాదర్‌బాష, నవీన్ పాల్గొన్నారు.

అవీ-ఇవీ

కార్మికులకు గౌరవ వేతనమివ్వాలి

కర్నూలు(సెంట్రల్): మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల ప్రకారం గౌరవ వేతనం ఇవ్వాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీవాణి డిమాండ్ చేశారు. సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా ముఖ్యమంత్రి రూ.10 వేల వేతనం ఇస్తామని చెప్పారని, ఆ హామీని నిలబెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి లీలావతి, జహరాబీ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. ఎకరాకు రూ.40 వేలు ఇన్‌పుట్ సబ్సిడీగా వేయాలన్నారు. పి.రామకృష్ణారెడ్డి, జి.చంద్రశేఖర్, ఈశ్వర్, నల్లన్న, సోమన్న, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, రామచంద్ర పాల్గొన్నారు.

నేడు సామూహిక భగవద్గీత పారాయణం

కర్నూలు కల్చరల్: గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 8.30 గంటలకు సంకల్‌బాగ్‌లోని గీతా ప్రచార ధామంలో సామూహిక భగవద్గీత పారాయణం నిర్వహిస్తున్నట్లు గీతా ప్రచార సంఘం అధ్యక్షుడు డీవీ రమణ తెలిపారు. ఏకాదశిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న పారాయణంలో సంఘం సభ్యులు, భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ధర్మకర్తల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఓర్వకల్లు: ఎస్.కొంతలపాడు గ్రామంలో వెలసిన యాగంటీశ్వరస్వామి దేవస్థానానికి నూతన ధర్మకర్తల మండలి నియామకం కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆలయ ఈఓ మద్దిలేటి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవదాయ ధర్మదాయశాఖ నిబంధనల మేరకు హిందూ మతస్తులైన 7 మంది సభ్యులతో కూడిన పాలకవర్గంలో ఎస్సీ మహిళ-1, బీసీ మహిళ-1, ఎస్టీ మహిళ-1, ఓసీ మహిళ-1, నాయీబ్రాహ్మణులకు సంబంధించి పురుషుడు-1, ఓసీ పురుషులు-2 చొప్పున అభ్యర్థులు ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 20వ తేదీలోగా కర్నూలు డీసీ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు సోమవారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.378 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

జగనన్నకు విద్యార్థులే స్టార్ క్యాంపెయినర్స్



మాట్లాడుతున్న కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆదిమూలపు సతీష్, చిత్రంలో వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చైతన్య

కర్నూలు సిటీ: విద్యారంగాన్ని బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్టార్ క్యాంపెయినర్స్ స్టూడెంట్సే అని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త డా.ఆదిమూలపు సతీష్ అన్నారు. సోమవారం నగరంలోని మైపర్ కాలేజీలో ఆ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు రెడ్డిపోగు ప్రశాంత్ ఆధ్వర్యంలో కాలేజ్ కెపెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. దేశంలో ఎవరూ చేయని విధంగా విద్యా రంగానికి సీఎం వైఎస్ జగన్ రూ.73 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. విద్యా వ్యవస్థల్లో తీసుకొచ్చిన సంస్కరణలను ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్నాయన్నారు. విద్యారంగాన్ని బలోపేతం చేసిన జగనన్న రుణం తీర్చుకునేందుకు విద్యార్థులు స్టార్ క్యాంపెయినర్స్‌గా మారి ఆయనను మరోసారి సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ స్కూళ్ల సౌకర్యాలు, విద్యా బోధనలో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తయారయ్యాయన్నారు. ప్రభుత్వ బడుల్లో చదివే పిల్లలు ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించే స్థాయికి చేరుకున్నారన్నారు. అనంతరం విద్యా రంగంలో వచ్చిన మార్పులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు మణిరెడ్డి, సంతోష్, మధు, ఆర్‌యూ నాయకులు అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

- ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన ఎం.శేషిరెడ్డి



కలెక్టర్ డాక్టర్ సృజనను కలసి మొక్క అందజేస్తున్న ఆర్డీఓ శేషిరెడ్డి

కర్నూలు(సెంట్రల్): నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తానని కర్నూలు ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన కర్నూలు ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఆయన కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జేసీ నారపురెడ్డి మౌర్యను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం తన కార్యాలయంలో తహసీల్దార్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుది ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేయాలంటే జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ అనుమతి తప్పనిసరి అన్నారు. జాబితాలో మొత్తంలో 0.1 శాతం ఓట్లలో మార్పులు, చేర్పులు చేయాలంటే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, పెండింగ్ దరఖాస్తుల పరిశీలన చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ విషయంలో కొత్తగా వచ్చిన తహసీల్దార్లు పాత కేసులపై అవగాహన పెంచుకొని కోర్టుల ఆదేశాల మేరకు కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న కాలనీల్లో పేదలకు ఇచ్చిన పట్టాలను రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియను కూడా ప్రాధాన్యతగా తీసుకోవాలన్నారు. నిజాయితీగా పనిచేసే అధికారులకు తన అండదండలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏఓ వేణుగోపాల్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరించిన అర్బన్ తహసీల్దార్

కర్నూలు అర్బన్ తహసీల్దార్‌గా కె.మోహన్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా అనంతపురం జిల్లా పుట్లూరు నుంచి ఆయనను కర్నూలు జిల్లాకు కేటాయించారు. ఇక్కడ కర్నూలు అర్బన్ తహసీల్దార్‌గా నియమించడంతో సోమవారం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన అనంతపురం జిల్లాలోని అనంతపురం అర్బన్, బుక్కరాయ సముద్రం, పుట్లూరులో తహసీల్దార్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన

కర్నూలు(సెంట్రల్): ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడలో సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయరాదని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన బాధిత రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయరాదన్నారు. ప్లాంట్‌కోసం భూములు తీసుకుంటే తమకు జీవనాధారం ఎలా అని రైతులు ప్రశ్నిస్తున్నట్లు చెప్పారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ జి.సృజనకు వినతిపత్రం ఇచ్చారు.

బ్రాహ్మణుల ఐక్యతతోనే సమస్యలకు పరిష్కారం

కర్నూలు(అర్బన్): బ్రాహ్మణులు ఐకమత్యంగా ఉంటేనే సమస్యలను పరిష్కరించుకునేందుకు వీలు కలుగుతుందని బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధి గురించి చర్చించేందుకు ఏర్పాటు చేసిన సమావేశాలకు విధిగా హాజరై తమ సలహాలు, సూచనలు అందించాలన్నారు. బ్రాహ్మణ భవనాలు, అపరకర్మల భవనాలను నిర్మించుకునేందుకు, పిల్లల భవి ష్యత్తుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై ఏకాభిప్రాయ సాధన అవసరమన్నారు. రాజకీయ పార్టీల ప్రలోభాలకు గురి కాకుండా తగు జాగ్రత్తతో ముందుకు వెళ్లాలన్నారు.